సాక్షి కామారెడ్డి
శనివారం ‌। 29 । మార్చి । 2025






### పంట రుణాలు మాఫీ చేయాలి

జిల్లాలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో మహాజన సభలు నిర్వహించారు.

- 10లో ▸







### వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.




### సాక్షి కవితలకు ఆహ్వానం..

తెలుగు ప్రజల నూతన సంవత్సరాది ఉగాది. ఈ పండగకు చాలా ప్రాముఖ్యత ఉంది. ఉగాది ప్రాశస్త్యాన్ని వివరిస్తూ 'సాక్షి' కవితలను ఆహ్వానిస్తోంది. 10 లైన్లకు మించకుండా మీ కవితను పంపండి. మీ ఫొటోను జత చేయండి. ఎంపిక చేసిన కవితలను ఉగాది రోజున ప్రచురిస్తాం..

పంపించాల్సిన వాట్సాప్ నంబర్ :
**95539 55625**

# అమాత్య యోగం దక్కేనా?




కేబినెట్ విస్తరణపై జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఆశలు పెంచుకున్నారు. మంత్రివర్గంలో చోటు కోసం ఎవరి ప్రయత్నాల్లో వారు బిజీగా ఉన్నారు. అయితే మంత్రి పదవి ఇవ్వడం వీలుకాకపోతే చీఫ్ విప్ లేదా విప్ పదవులతో సర్దుబాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

- ఢిల్లీ స్థాయిలో మదన్‌మోహన్‌రావు ప్రయత్నాలు
- జుక్కల్‌కు అవకాశం ఇవ్వాలంటున్న లక్ష్మీకాంతారావు
- అంతటా మంత్రివర్గ విస్తరణపైనే చర్చలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కాంగ్రెస్ నాయకత్వం మంత్రివర్గ విస్తరణకు కసరత్తు చేస్తుండడంతో ఉమ్మడి జిల్లా నుంచి పదవులు ఆశిస్తున్న ఎమ్మెల్యేలు చివరి ప్రయత్నాల్లో ఉన్నారు. ఉగాది తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న సంకేతాలు వెలువడడంతో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఢిల్లీ స్థాయిలో సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. తొలిసారి గెలిచినప్పటికీ జాతీయ నాయకత్వంతో తనకున్న పరిచయాలతో ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణాలు కలిసొస్తే తనకు మంత్రి పదవి దక్కుతుందన్న ధీమాతో ఉన్నారు. తమ నాయకుడికి మంత్రి పదవి తప్పకుండా వస్తుందంటూ ఆయన అనుచరులు ధీమాగా చెబుతున్నారు. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం అయిన జుక్కల్ నుంచి గెలుపొందిన తోట లక్ష్మీకాంతారావు కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. జుక్కల్ నియోజకవర్గం ఆవిర్భవించినప్పటినుంచి ఇప్పటివరకు ఏ ఒక్క ఎమ్మెల్యేకూ మంత్రిగా అవకాశం రాలేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని జుక్కల్ నియోజకవర్గానికి ఈసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే పార్టీ పెద్దలను కోరుతున్నట్లు తెలుస్తోంది. కామారెడ్డికి చెందిన సీనియర్ నాయకుడు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మైనారిటీ కోటాలో తనకు అవకాశం ఇవ్వాలని మొదటి నుంచి కోరుతున్నారు. పార్టీలో మైనారిటీ వర్గం నుంచి సీనియర్ నేతగా గుర్తింపు ఉంది. గతంలో రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేశారు. అయితే ఇటీవల భర్తీ చేసిన ఎమ్మెల్సీ స్థానాలలో ఆయనకు అవకాశం ఇవ్వకపోవడంతో నిరాశ చెందారు. ఏదేని పరిస్థితుల్లో అవకాశం వస్తే మంత్రి కావాలని ఆయన ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

**చీఫ్ విప్, విప్ పదవులిచ్చే అవకాశం...**

మంత్రి పదవులు ఆశించిన ఎమ్మెల్యేలను ఏదో ఒక పదవితో సర్దుబాటు చేసేందుకు కాంగ్రెస్ నాయకత్వం సమాలోచనలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. సామాజిక సమీకరణాల నేపథ్యంలో మంత్రి పదవి అవకాశం దక్కని వారికి విప్, చీఫ్ విప్ పదవులు ఇవ్వడానికి మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు మంత్రి పదవి ఇవ్వడానికి సమీకరణాలు అనుకూలించకపోతే విప్ లేదా చీఫ్ విప్ పదవి ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. జిల్లాలో ఎవరో ఒకరికి మంత్రి పదవి రాకుంటే విప్ లేదా చీఫ్ విప్ దక్కే అవకాశాలున్నట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

**నామినేటెడ్ పదవులపై ఆశలు**

ఓ వైపు మంత్రి పదవులకోసం ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తుండగా నామినేటెడ్ పదవుల కోసం జిల్లాకు చెందిన పలువురు నేతలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. జిల్లా నుంచి బాన్సువాడకు చెందిన కాసుల బాల్‌రాజు ఒక్కరికే రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ అవకాశం దక్కింది. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావుతో పాటు పలువురు నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తున్న తమకు అవకాశం ఇవ్వాలంటూ పార్టీ నేతలతో మొరపెట్టుకుంటున్నారు.

**గతంలో పలువురికి అవకాశం..**

2004 లో ఏర్పడిన వైఎస్సార్ మంత్రి వర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి డి.శ్రీనివాస్‌తో పాటు షబ్బీర్ అలీ మంత్రులుగా పనిచేశారు. 2009 లో వైఎస్సార్ మంత్రి వర్గంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి అవకాశం దొరికింది. 2014 లో కేసీఆర్ ప్రభుత్వంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంత్రి అయ్యారు. కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు ప్రభుత్వ విప్‌గా అవకాశం దొరికింది. 2018లో ఉమ్మడి జిల్లా నుంచి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి అవకాశం దక్కింది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీ స్పీకర్‌గా ఐదేళ్లు పనిచేశారు. గంప గోవర్ధన్ ప్రభుత్వ విప్‌గా రెండో పర్యాయం నియమితులయ్యారు. 2023 ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగా, ఉమ్మడి జిల్లా నుంచి ఏ ఒక్కరికీ మంత్రిగా అవకాశం దక్కలేదు. షబ్బీర్ అలీతోపాటు పోచారం శ్రీనివాస్‌రెడ్డిలను ప్రభుత్వ సలహాదారులుగా నియమించారు.

## ఉద్యోగ విరమణ చేయనున్న అదనపు కలెక్టర్



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్‌రెడ్డి ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. 30, 31 తేదీలు సెలవులు కావడంతో అదనపు కలెక్టర్‌గా ఆయనకు శనివారమే చివరి వర్కింగ్ డే కానుంది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగ విరమణ వేడుక నిర్వహించారు.

**జెడ్పీ సీఈవోకు ఇన్‌చార్జి బాధ్యతలు?**

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో ఇన్‌చార్జి బాధ్యతలను జెడ్పీ సీఈవో చందర్ నాయక్‌కు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. దీనిపై శనివారం ఉత్తర్వులు జారీ అవుతాయని భావిస్తున్నారు.

## ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల్లో టెన్షన్

**తప్పుడు ఎంట్రీలతో ఇబ్బందులు**

- ఆన్‌లైన్‌లో ఫీజుల మార్పులతో గందరగోళం
- నిషేధిత జాబితాలో ప్రైవేట్ ప్లాట్లు
- ఫోన్ నంబర్ తప్పులతో ఇక్కట్లు
- ఈనెలాఖరుతో ముగియనున్న గడువు



కామారెడ్డి టౌన్ : జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించుకోవడానికి దరఖాస్తుదారులు ముందుకొస్తున్నా సాంకేతికపరంగా ఆన్‌లైన్‌లో దొర్లిన తప్పులతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తప్పులను సరిదిద్దేందుకు టౌన్‌ప్లానింగ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ఆన్‌లైన్ తప్పిదాల బాధితులు రోజురోజుకు పెరుగుతున్నారు. మరోవైపు 25 శాతం రాయితీ గడువు ఈనెల 31తో ముగియనుంది. గడువు సమీపించడంతో దరఖాస్తుదారుల్లో టెన్షన్ పెరుగుతోంది.

**భారీగా దరఖాస్తులు వచ్చినా..**

జిల్లాలో మూడు మున్సిపాలిటీలు ఉన్నాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ బల్దియాల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. వాటి పరిష్కారానికి ప్రభుత్వం గతనెలలో అవకాశం ఇచ్చింది. అయితే దరఖాస్తుల పరిష్కరణలో సాంకేతిపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసిన సమయంలో జరిగిన పొరపాట్లతో చాలామంది వివరాలు ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో నిషేధిత జాబితాలో చూపుతున్నాయి. ఇలాంటివి మూడు మున్సిపాలిటీల్లో ఇప్పటి వరకు 1,567 దరఖాస్తులు గుర్తించారు. చాలామంది దరఖాస్తుదారులు ఫోన్ నంబర్‌లు తప్పుగా నమోదు చేయడంతో మీ–సేవా కేంద్రాలలో, సిటిజన్ లాగిన్‌లో ఓపెన్ కావడం లేవు. టౌన్ ప్లానింగ్ అధికారుల లాగిన్‌లో మాత్రం ఓపెన్ అవుతున్నాయి. దరఖాస్తుల ఎంట్రీ సమయంలో ప్లాట్ల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, సర్వే నంబర్లు, ప్లాట్ల నంబర్లు తప్పులుగా నమోదు అయ్యాయి. దరఖాస్తుదారుడి లాగిన్‌లో, మీసేవా కేంద్రాలలో, అధికారుల లాగిన్‌లో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో వ్యత్యాసాలు చూపుతున్నాయి. ఇలా వివిధ కారణాలతో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

**మూడు బల్దియాల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు..**

| బల్దియా | దరఖాస్తులు | అర్హత కలిగినవి | ఫీజు చెల్లించినవి |
|---|---|---|---|
| కామారెడ్డి | 17,622 | 15,484 | 1,938 |
| బాన్సువాడ | 1,875 | 1,356 | 136 |
| ఎల్లారెడ్డి | 908 | 602 | 80 |

**తప్పులను సవరిస్తున్నాం**

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న సమయంలో వివరాలను తప్పుగా నమోదు చేయడంతో ఇబ్బందులు ఎదరవుతున్నాయి. ప్రస్తుతం తప్పులను సవరిస్తున్నాం. ఫీజు హెచ్చుతగ్గులున్నట్లు అనిపిస్తే.. ప్రస్తుతం ఫీజు చెల్లించండి. విచారణ అనంతరం ఆ మొత్తాన్ని సర్దుబాటు చేస్తాం.

– గిరిధర్, టీపీవో, కామారెడ్డి

## న్యూస్‌రీల్

### నేడు ఎమ్మెల్సీ కవిత రాక

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎమ్మెల్సీ కవిత శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆమె ఉదయం రామారెడ్డి మండల కేంద్రంలోని కాలభైరవ స్వామి ఆలయాన్ని దర్శించుకుంటారు. అనంతరం జిల్లా కేంద్రంలోని శుభం కన్వెన్షన్‌లో నిర్వహించే బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. ఈ విషయాన్ని పార్టీ వర్గాలు తెలిపాయి.

### 'నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి'



రామారెడ్డి: కృత్రిమ మేధ(ఏఐ) సహాయంతో విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింతగా మెరుగుపరచుకోవాలని పదో తరగతి పరీక్షల రాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి సూచించారు. శుక్రవారం ఆమె మద్దికుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐ ద్వారా పాఠాలు వింటున్న విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనంద్‌రావు, హెచ్‌ఎం తిరుపతి, ఉపాధ్యాయులు రాజన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### అడ్లూర్ ఎల్లారెడ్డిలో పొలం బాట



సదాశివనగర్ : అడ్లూర్ ఎల్లారెడ్డిలో శుక్రవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఏవైనా విద్యుత్ సమస్యలు ఎదురైతే సంబంధిత శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సీఈ రామకృష్ణ, డీఈ కళ్యాణ్, ఏఈ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ అంశంపై ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ కల్పన కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి ప్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తిచేసిన 26 ఏళ్లలోపువారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వచ్చేనెల 8వ తేదీలోగా https://tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు ఈనెల 12న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు నిజామాబాద్ బీసీ స్టడీ సర్కిల్ (08462- 241055)లో సంప్రదించాలని సూచించారు.

### 'పోచారం' నీటివిడుదల ప్రారంభం



నాగిరెడ్డిపేట : పోచారం ప్రాజెక్టు నుంచి శుక్రవారం ఐదోవిడత నీటి విడుదలను ప్రారంభించారు. నీటి పారుదల శాఖ సిబ్బంది ప్రాజెక్టు గేట్లను పైకెత్తి ప్రధాన కాలువలోకి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 0.490 టీఎంసీల నీరు నిల్వ ఉందని నీటి పారుదల శాఖ ఏఈ అక్షయ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువలోకి 259 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. యాసంగి పంటలసాగు పూర్తయ్యే వరకు ప్రాజెక్టు నుంచి నీటివిడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు.

## ధాన్యాన్ని దళారులకు అమ్మొద్దు



బీర్కూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : రైతులు పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. బీర్కూర్‌లో శుక్రవారం ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయిలతో కలిసి ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్‌కు సంబంధించి వరి కోతలు ఇతర ప్రాంతాలతో పోలిస్తే బాన్సువాడ నియోజకవర్గంలో ముందస్తుగా ప్రారంభమవుతాయన్నారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. నిబంధనలకు లోబడి ఉన్న సన్నరకం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్యామల, తహసీల్దార్ శ్రీలత, నాయకులు యామ రాములు, సందీప్, సాయిబాబా, రఘు, శశికాంత్, బోయిని శంకర్, ఆరిఫ్, కాశీరాం, మన్నన్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయం కోసం స్థల పరిశీలన

మద్నూర్: కేంద్రీయ విద్యాలయం కోసం శుక్రవారం మండల కేంద్రంలోని సోమలింగాల శివాలయం సమీపంలోగల నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు పరిశీలించారు. మద్నూర్‌కు గతంలోనే కేంద్రీయ విద్యాలయం మంజూరైన విషయం తెలిసిందే. శుక్రవారం కేంద్రీయ విద్యాలయాల డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, డీఈవో రాజు విద్యాలయ భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించనున్న నేపథ్యంలో మద్నూర్ నుంచి దెగ్లూర్‌కు వెళ్లే రహదారిపై 11 గదులు ఉన్న తాత్కాలిక భవనాన్ని కూడా పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, ఎంఈవో రాములు తదితరులున్నారు.



తాత్కాలిక భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి

- నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా చూడాలి
- లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సంతాయిపేట్ శివారులో కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

తాడ్వాయి : ప్రతి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన సంతాయిపేట్ శివారులోని భీమేశ్వరాలయం సమీపంలోగల చెక్ డ్యాంలో పూడిక తీత పనులను పరిశీలించారు. పనులు చేస్తున్నా కూలి చెల్లించలేదని, పోస్టాఫీస్ ద్వారా చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని పలువురు కూలీలు కలెక్టర్‌తో పేర్కొన్నారు. కొందరికి ఎనిమిది వారాల కూలి డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పోస్టల్ శాఖ ద్వారా కాకుండా బ్యాంకు ఖాతాల ద్వారా కూలి చెల్లించే ఏర్పాట్లు చేయాలని డీఆర్‌డీవోకు కలెక్టర్ సూచించారు.

**భీమేశ్వరాలయం సందర్శన**

కలెక్టర్ సంతాయిపేట్ శివారులోని భీమేశ్వరాలయాన్ని సందర్శించి, పూజలు చేశారు. ఎంతో చరిత్ర ఉన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. రోడ్డు, నీరు, టాయిలెట్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆలయ సమీపంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన గ్రామంలోని నర్సరీని పరిశీలించి, ఇంటింటికీ పంపిణీ చేసేందుకు పండ్లు, పూల మొక్కలను పెంచాలని సూచించారు. అనంతరం పల్లె ప్రకృతి వనంలో కలెక్టర్ మొక్కలకు నీరు పోశారు. గ్రామానికి చెందిన ప్రమీల అనే లబ్ధిదారుకు సంబంధించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం బ్రహ్మాజీవాడి శివారులోని రోడ్డుకు ఇరువైపులా మొక్కలకు వాటరింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఇన్‌చార్జి తహసీల్దార్ రేఖ, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఏపీవో కష్టాగౌడ్, టెక్నికల్ అసిస్టెంట్ స్వామి, పంచాయతీ కార్యదర్శి పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



భీమేశ్వరాలయంలో పూజలు చేస్తూ..

### హెల్ప్‌డెస్క్ ప్రారంభం



కామారెడ్డి క్రైం: రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాల కోసం జిల్లాలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లను ప్రారంభించినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో హెల్ప్‌డెస్క్ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ పథకాలకు నిరుద్యోగ యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వేగంగా మంజూరు చేయాలని తహసీల్దార్‌లను కలెక్టర్ ఆదేశించారు.

### 'ఉద్యోగ నియామకాలలో అక్రమాలపై విచారణ జరపాలి'

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మెడికల్ కళాశాలలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో అక్రమాలు జరిగాయని దరఖాస్తుదారులు ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై వారు శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో మ్యాన్ పవర్ సొసైటీ అనే ఏజెన్సీ అనర్హులైన అభ్యర్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి అక్రమంగా ఉద్యోగాలు ఇచ్చిందని ఆరోపించారు. దీంతో అర్హులైన నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విచారణ జరిపించి, అర్హులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. అభ్యర్థులకు బీసీ, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, వినోద్ మద్దతు పలికారు.

### బోరు మడి



మెట్ట ప్రాంతమైన కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్లలో రైతులు భూగర్భ జలాలపైనే ఆధారపడి సేద్యం చేస్తుంటారు. బోర్లు ఎత్తిపోయినపుడు, ఊట తగ్గినప్పుడు రైతులు పంటలను కాపాడుకునేందుకు అప్పులు చేసి మళ్లీ బోర్లు వేయిస్తుంటారు. లింగంపేట మండలంలోని సజ్జన్‌పల్లితండా శివారులో ఓ రైతు పంటను కాపాడుకోవడానికి ఒక మడిలో ఐదు బోరుబావులు తవ్వించాడు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది. –సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

## క్లుప్తంగా

### విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలి



దోమకొండ: విద్యార్థులు ఆశయ సాధనతో ముందుకెళ్లాలని, ఉన్నత స్థాయిలో రాణించాలని సైంటిస్ట్ భారతి అన్నారు. శుక్రవారం మండలంలోని సంఘమేశ్వర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యంతో విద్యను అభ్యసించాలని చెడు మార్గాల వైపు ఆకర్షితులు కావొద్దని కోరారు. తల్లిదండ్రులు కలలు, ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ, మండల విద్యాధికారి విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

### విస్తృతంగా వాహనాల తనిఖీ



కామారెడ్డి క్రైం: వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని ట్రాఫిక్ ఎస్సై మహేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, అశోక్‌నగర్ రోడ్డు, స్టేషన్ రోడ్, తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. యజమానులతో నంబర్ ప్లేట్‌లు తెప్పించి ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు సహకరించాలని కోరారు.



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ నర్సింలు



గాంధారిలో మాట్లాడుతున్న చైర్మన్ సాయికుమార్



తాడ్వాయిలో మహాజన సభను నిర్వహిస్తున్న సంఘ సభ్యులు

# రైతులందరి రుణాలను మాఫీ చేయాలి

- సొసైటీల ద్వారానే ధాన్యం కొనుగోలు చేపట్టాలి
- మహాజన సభల్లో తీర్మానం



రాజంపేట: అర్గొండలో మాట్లాడుతున్న చైర్మన్ కంది శివరాములు

రాజంపేట/ఎల్లారెడ్డిరూరల్/గాంధారి/తాడ్వాయి/లింగంపేట/నిజాంసాగర్/బిచ్కుంద: రుణమాఫీ కాని రైతులందరికి మాఫీ చేయాలని పలు మహాజన సభల్లో తీర్మానం చేశారు. శుక్రవారం అర్గొండలో సింగిల్ విండో చైర్మన్ కందిశివరాములు, రాజంపేటలో నల్లవెల్లి అశోక్‌ల అధ్యక్షతన మహాజనసభలు నిర్వహించారు. రాజంపేట సొసైటీకి కేటాయించిన ఐదు ఎకరాల భూమిలో ఉపాధి హామీ పనుల చేపట్టాలని, అదే విధంగా సొసైటీ పరిధిలో కాంప్లెక్స్ భవన నిర్మాణం చేపట్టాలని తీర్మానించారు. రైతులకు ప్రభుత్వం ఏకకాలంలో రుణమాఫీ చేయాలని ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ నర్సింలు అన్నారు. సొసైటీ ఆవరణలో నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల ద్వారా కాకుండా సొసైటీల ద్వారానే ధాన్యం కొనుగోలు చేసేలా చూడాలని కోరారు. సహకారం సంఘంలో తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని గాంధారి విండో చైర్మన్, డీసీసీబీ, డీసీఎంఎస్ డైరెక్టర్ సాయికుమార్ అన్నారు.

స్థానిక సహకార సంఘం భవనంలో చైర్మన్ అధ్యక్షతన నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. పేట్‌సంగెంలో త్వరలో గోదాం నిర్మాణ పనులు చేపడతామన్నారు. తాడ్వాయి సింగిల్ విండో కార్యాలయంలో విండో చైర్మన్ నల్లవెల్లి కపిల్ రెడ్డి అధ్యక్షతన మహాజనసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ సంఘాలకు కొనుగోలు సెంటర్లను అప్పజెప్పితే సొసైటీలు నష్టాల బాటలో నడుస్తాయన్నారు. దీర్ఘకాలిక రుణాలు జూలై నెలాఖరు వరకు ఒకే దఫాలో చెల్లించే వెసలు బాటు కల్పించాలని తీర్మానం చేశారు. లింగంపేట మండలం నల్లమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మహాజన సభ చైర్మన్ రమేశ్ అధ్యక్షతన నిర్వహించారు. నిజాంసాగర్ మండలం అచ్చంపేట రైతు వేదికలో సొసైటీ మహాజన సభను చైర్మన్ కయ్యం. నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. బిచ్కుంద మహాజన సభను చైర్మన్ బాలాజీ శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం రైస్ మిల్ స్థలంలో ఫంక్షన్ హాల్ నిర్మాణం, జొన్న కొనుగోలు కేంద్రం త్వరగా ప్రారంభించాలని తీర్మానం చేశారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈసందర్భంగా కార్యదర్శులు జమ ఖర్చులు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు, కార్యదర్శులు, డైరెక్టర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షా కేంద్రం వద్ద ప్రభుత్వ లెక్చరర్ల ప్రచారం



ప్రచారం చేస్తున్న ప్రభుత్వ లెక్చరర్లు

గాంధారి(ఎల్లారెడ్డి): పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్‌లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలోనే ప్రవేశం పొందాలని శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్లు శుక్రవారం విద్యార్థులకు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రం వద్ద లెక్చరర్లు శంబాజీ, మమత విద్యార్థులను కలిశారు. వారికి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రభుత్వం నుంచే అందే సంక్షేమ పథకాలను వివరించారు. విద్యార్థులు తప్పకుండా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోను చేరాలని కోరారు.

# ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్



దోమకొండ శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై స్రవంతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ సూచించారు. ఉగాది, రంజాన్ ఒకేసారివస్తున్న క్రమంలో హిందూ, ముస్లింలు శాంతియుత వాతావరణంలో పండుగలను నిర్వహించుకోవాలన్నారు. నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో వివిధ మతస్తులతోపాటు మండలకేంద్రంలో జరిగే ఉగాది జాతర ఉత్సవాల నిర్వాహణపై శుక్రవారం ఆయన శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది జాతరలో భాగంగా నిర్వహించబోయే ఎడ్లబండ్లలో పాల్గొనే ప్రతి బండివారు తమకు, తోటి బండివారికి సహకరించాలన్నారు. దీంతోపాటు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాతరలో దుకాణాలను ఏర్పాటు చేసుకునేలా మార్కింగ్ ఇవ్వాలని ఎస్సై మల్లారెడ్డికి సూచించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎస్సై మల్లారెడ్డి, ఆలయకమిటీ సభ్యులు, పలువురు మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మండల కేంద్రానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ ఆలయాల కమిటీ అధ్యక్షులు, ముస్లిం మత పెద్దలతో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ఎస్సై స్రవంతి మాట్లాడారు. ఉగాది రోజున ఎడ్లబండ్ల ప్రదర్శన ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు. ఏఎస్సై జానీపాషా, గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అధిక ధరకు భూమి కొనడంపై రైతుల ఆగ్రహం

- బీర్కూర్ మహాజన సభలో కార్యదర్శిని నిలదీసిన రైతులు



బీర్కూర్‌లో కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

బాన్సువాడ : అధిక ధరకు భూమిని కొనుగోలు చేయడంపై సహకార సంఘం కార్యదర్శి విఠల్‌పై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం బీర్కూర్ మహాజన సభను ఇన్‌చార్జి చైర్మన్ రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఆదాయ, ఖర్చుల వివరాలను రైతులకు కార్యదర్శి చదివి వినిపించారు. బీర్కూర్ సహకార సంఘం పరిధిలోని బరంగెడ్గిలో కొత్త గోదాం నిర్మాణానికి 30 గుంటల భూమిని రూ.41.25 లక్షలు పెట్టి కొనుగోలు చేసినట్లు రైతులకు కార్యదర్శి వివరించారు. బీర్కూర్ మండల కేంద్రంలో ఎకరం భూమి ధర రూ.30 లక్షల కంటే తక్కువగా ఉంటే బరంగెడ్గి గ్రామంలో అంత ధర పెట్టి ఎలా కొనుగోలు చేశారని కార్యదర్శి విఠల్‌ను రైతులు నిలదీశారు. తప్పుడు లెక్కలు చెబుతున్నారని సహకార సంఘంలో భారీ అవినీతి జరిగిందని రైతులు కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# బస్వాపూర్‌లో దొంగల బీభత్సం

- తాళాలు వేసిన తొమ్మిది ఇళ్లలో చొరబడ్డ దుండగులు
- సుమారు రూ.15లక్షల బంగారం, నగదు అపహరణ



బస్వాపూర్‌లో దొంగలు ధ్వంసం చేసిన బీరువా

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలోని తాళాలు వేసిన తొమ్మిది ఇళ్లల్లో గుర్తుతెలియని దుండగులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.15లక్షల వరకు బంగారం, నగదును ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. గుర్తుతెలియని దుండగులు గురువారం అర్ధరాత్రి గ్రామంలోకి చొరబడి సీసీ కెమెరాల కేబుల్స్‌ను కత్తిరించారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడ్డారు. ఒక ఇల్లు తర్వాత ఇంకో ఇల్లు తాళాలు పగులగొడుతూ సుమారు తొమ్మిది ఇళ్లలో చోరీ చేశారు. దాకి రమేశ్ అనే వ్యక్తి ఇంట్లో మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు, వెండి వస్తువులను దొంగిలించారు. పక్కన ఉన్న నాగమణి ఇంట్లో మూడు తులాల బంగారం ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మామిడి సత్తమ్మ ఇంట్లో అర తులం బంగారం, రూ.5 వేలు నగదు, సుజాత ఇంట్లో రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. సువర్ణ ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు, మన్నె దర్మరాజు ఇంట్లో తులం బంగారం, రూ.50 వేల నగదు దోచుకెళ్లారు. చంద్రయ్య ఇంట్లో తులం బంగారం, రూ.పది వేల నగదు, చింత వినయ్ ఇంట్లో రూ.6 వేలు నగదు, సాన్నాయల స్వామి ఇంట్లో నగదు, ఇళ్ల ముందు ఉన్న బైకును కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. మొత్తంగా సుమారు రూ.15 లక్షల విలువైన బంగారం ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లినట్టు అంచనా వేస్తున్నారు. శుక్రవారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాలకు వెళ్లి, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ



లింగంపేట బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రవీందర్

లింగంపేట/ఎల్లారెడ్డి/సదాశివనగర్ : లింగంపేట బాలుర ఉన్నత పాఠశాల, మైనారిటీ గురుకుల పాఠశాలలో కొనసాగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎల్లారెడ్డి సీఐ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎల్లారెడ్డిలో పది పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఎంఈవో వెంకటేశం అన్నారు. పట్టణంలోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ యూసుఫ్ తనిఖీ చేశారని పేర్కొన్నారు. సదాశివనగర్‌తో పాటు కల్వరాల్ పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ సోఫ్ట్ తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నవీపేట: నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పొల్దా గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు ఎస్సై వినయ్ శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన కూలీలు మీర్జా సలీమ్‌బేగ్, మహమ్మద్ అస్లామ్, మహమ్మద్ అన్వర్‌లు పని ముగిశాక జన్నెపల్లి నుంచి నిజామాబాద్‌కు వెళ్లేందుకు ఆటోలో ఎక్కారు. పొల్దా శివారులో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఆటోను ఢీకొనడంతో ఆటోలోని ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

### 2.1 కిలోల గంజాయి పట్టివేత



ఖలీల్‌వాడి: నగరంలో ఎండు గంజాయిని తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసి, 2.1కిలోల(2100 గ్రాములు) గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సీఐ విలాస్ తెలిపారు. నగరంలోని మాలపల్లి ప్రాంతానికి చెందిన సోహెబ్‌ఖాన్ నిజామాబాద్ రూరల్ మండలం ఖానాపూర్ గ్రామంలోని జన్నెపల్లి రోడ్డులో రైల్వేగేట్ వద్ద ఎండు గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో వెంటనే సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అతడి సెల్, బైక్‌తోపాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితుడిని అరెస్ట్ చేసి, ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో అప్పగించినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై సింధు, సిబ్బంది కిరణ్‌కుమార్, గోపి, నర్సయ్య చారి, నీలీరాజు, సాగర్‌రావు, సుధీర్, దశ పాల్గొన్నారు.

### కరెంట్‌షాక్‌తో గుర్తుతెలియని యువకుడి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని గుర్తుతెలియని యువకుడు కరెంట్ షాక్‌తో మృతి చెందినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం తెలిపారు. ఖలీల్‌వాడి ఏరియాలో నిర్మాణంలో ఉన్న భవనంలో సదరు యువకుడు పని చేస్తుండగా కరెంట్ షాక్ తగిలి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు సింగ్ లేదా సర్దార్‌గా కనబడుతున్నాడన్నారు. నెహ్రూ పార్క్ ఏరియా దగ్గర ఉన్న లేబర్ అడ్డా దగ్గర నుంచి పనికి వెళ్తా ఉంటాడని తెలిపారు. ఎవరైనా యువకుడి వివరాలు తెలిస్తే ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ సంప్రదించాలన్నారు.

### డిచ్‌పల్లి సీఐ, జక్రాన్‌పల్లి ఎస్సైపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి: హైకోర్టు ఉత్తర్వులు బేఖాతరు చేసి సివిల్ తగాదాల్లో తలదూర్చిన డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ మహేందర్‌లపై కేసు నమోదు చేయాలని జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామానికి చెందిన రావుట్ల ఆలియాస్ రాగుట్ల నచ్చన్న శుక్రవారం సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు చేశారు. అలాగే కేసు వాపసు తీసుకోవాలని నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి బెదిరింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతిలతోపాటు భూమిని కబ్జా చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

### ఏటీఎం చోరీకి యత్నించిన దుండగుల అరెస్టు



డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి శివారులోగల ఎస్‌బీఐ ఏటీఎంలో ఇటీవల చోరీకి యత్నించిన ఇద్దరు దుండగులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. డిచ్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. నడిపల్లికి చెందిన రుద్రబోయిన గణేష్, కామారెడ్డికి చెందిన నిమ్మబోయిన సురేష్ గురువారం అర్ధరాత్రి ఎస్‌బీఐ ఏటీఎంను పగులగొట్టి అందులోని డబ్బులు చోరీ చేయడానికి యత్నించారు. అదే సమయంలో పెట్రోలింగ్ పోలీసులు అక్కడికి చేరుకోగా నిందితులు పారిపోయారు. వెంటనే అప్రమత్తమైన డిచ్‌పల్లి సీఐ, ఎస్సైలు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టగా నిందితులు పట్టుబడ్డారు. విచారణ జరుపగా ఏటీఎం చోరీకి యత్నించినట్లు అంగీకరించారు. నిందితులు గణేష్, సురేష్‌లు పాత నేరస్తులు. జైలులోనే ఇద్దరికి స్నేహం కుదరడంతో బయటకు వచ్చిన తర్వాత మళ్లీ దొంగతాలను పాల్పడుతున్నారు. వీరి వద్ద నుంచి నాలుగు బైక్‌లు, రూ.12వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది కేసులకు సంబంధించి వీరిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

# నగరంలో మహిళ దారుణ హత్య

- తన తల్లికి చెడు వ్యసనాలు అలవాటు చేస్తోందని హతమార్చిన దుండగుడు
- మృతదేహాన్ని కారులో తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు



కమల (ఫైల్)

నిజామాబాద్ రూరల్: నగరంలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. నిందితుడు మృతదేహాన్ని కారులో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రూరల్ సీఐ సురేష్, ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. కంఠేశ్వర్ బైపాస్ నుంచి దాస్‌నగర్ కెనాల్ కట్టవైపు వెళుతున్న ఓ కారు సిగ్నల్స్ వద్ద ఆపకపోవడంతోపాటు, కారు డిక్కీలోని కవర్ బయటకు కనబడటంతో పోలీసులకు అనుమానం వచ్చి వెంబడించారు. మాక్లూర్ పోలీసులు కారును ఆపగా, డిక్కీలో మహిళ మృతదేహం ఉండటంతో రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని నిందితుడు రాజేష్‌ను అదుపులోకి తీసుకొని వివరాలు తెలుసుకున్నారు. మృతురాలు ముబారక్ నగర్ ప్రాంతానికి చెందిన బింగి కమల(46)గా గుర్తించారు. ముబారక్ నగర్‌కు చెందిన రాజేష్ వాళ్ల అమ్మకు అదేప్రాంతానికి చెందిన కమల చెడు వ్యసనాలు అలవాటు చేస్తోంది. దీంతో ఆగ్రహించిన రాజేష్ గురువారం కమలను కంఠేశ్వర్ బైపాస్ లోపలికి తీసుకెళ్లాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగగా రాజేష్ కమలను బండరాయితో మోదీ హత్య చేశాడు. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని కాలువలో పడేయడానికి కారు డిక్కీలో పెట్టి బయలుదేరాడు. మృతదేహానికి కప్పిన కవర్ బయటకు రావడం, సిగ్నల్స్ వద్ద కారు ఆపకపోవడంతో పోలీసులు అనుమానం వచ్చి అతడిని పట్టుకున్నారు. మృతదేహాన్ని పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**పాంగ్రాలో మరో మహిళ..**

ఖలీల్‌వాడి: నగరంలోని పాంగ్రా కల్లుబట్టి సమీపంలో ఓ మహిళ హత్యకు గురైంది. సీఐ శ్రీనివాసురాజు తెలిపిన వివరాలు ఇలా.. పాంగ్రా కల్లుబట్టి సమీపంలోని ఇంట్లో నివాసముంటున్న చంద్రకళ(50)కు తన కూతురు మౌనిక నాలుగు రోజులుగా ఫోన్ చేసిన స్పందించలేదు. దీంతో అనుమానం వచ్చిన మౌనిక శుక్రవారం ఇంటికి వచ్చి చూడగా చంద్రకళ హత్యకు గురైనట్లు గుర్తించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, వారు ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధంతో దాడి చేసి హత్య చేసినట్లు, ఈనెల 23న ఘటన జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. నిందితులు మహిళ ఒంటిపై ఉన్న బంగారు నగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారురు. పోలీసులు పలువురు యువకులను ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

### రెండేళ్ల బాలుడు..



బాలుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్ పాలిటెక్నిక్ గ్రౌండ్ ప్రహరీ పక్కన గుర్తు తెలియని బాలుడు(2)ని కొట్టి చంపిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. టౌన్ సీఐ శ్రీనివాసరాజు తెలిపిన వివరాలు ఇలా.. పాలిటెక్నిక్ గ్రౌండ్ ప్రహరీ పక్కన ఓ టిప్పర్ నిలిపి ఉండగా, మూత్రవిసర్జనకు వెళ్లిన ఓ వ్యక్తి బాలుడి మృతదేహాన్ని గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని దుండగులు మధ్యాహ్న సమయంలో బాలుడిని టిప్పర్ వెనుకాలకు తీసుకుని వెళ్లి రాయితో కొట్టి చంపినట్లు పేర్కొన్నారు. బాలుడి ఆనవాళ్ల కోసం సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



చిన్నపోతంగల్‌లో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని చిన్న పోతంగల్ గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పుప్పాల భాగ్యలక్ష్మి(45)కి 18ఏళ్ల క్రితం ఆదే గ్రామానికి చెందిన రాములుతో వివాహం జరిగింది. వీరికి పిల్లలు పుట్టలేదు. భాగ్యలక్ష్మి గత కొన్నేళ్లుగా పలు వ్యాధులతో బాధపడుతుంది. ఈక్రమంలో గురువారం రాత్రి భోజనాల అనంతరం భర్త నిద్రపోయాక ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఉదయం కుటుంబ సభ్యులు వెతకగా గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో శవమై తేలింది. భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

**నవీపేట మండలంలో..**

నవీపేట: మండలంలోని నందిగామ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వినయ్ తెలిపిన వివరాలు ఇలా.. నందిగామ గ్రామానికి చెందిన కర్రోల్ల పోశెట్టి(43) తాగుడుకు బానిసై, తరచూ భార్య రోజాతో గొడవపడేవాడు. ఈనెల 27న రాత్రి దంపతుల మధ్య మళ్లీ గొడవ జరగడంతో తాగిన మైకంలో పోశెట్టి శివారులోని కొత్తకుంట చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

**నిజాంసాగర్ మండలంలో..**

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఒడ్డేపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా.. ఒడ్డేపల్లి గ్రామానికి చెందిన గూల కిష్టయ్య(30) మత్స్యకార్మికుడిగా జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెందిన కిష్టయ్య శుక్రవారం గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు.

### వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు

- పలువురిపై కేసులు నమోదు



గాంధారి (ఎల్లారెడ్డి): మండల పరిధిలోని తిప్పారం గ్రామంలో శుక్రవారం వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు చేసి పలు ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ అమాయకుల వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకుంటున్నారని ఫిర్యాదులు రావడంతో సోదాలు చేసినట్లు తెలిపారు. సోలంకి సాయిరాం, ఊగిలే ఆనంద్ రావు, బంగారువాడి బాలయ్య ఇళ్లలో పలు ప్రామిసరీ నోట్లు, దస్తావేజులు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# హత్య కేసులో ఐదుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్య రెడ్డి

కామారెడ్డి క్రైం: దోమకొండ మండలం చింతమాన్ పల్లి శివారులో గురువారం వేకువజామున ఈరబోయిన రమేష్ (38)అనే వ్యక్తి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో అతడిని తీవ్రంగా కొట్టి హత్య చేసిన ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కామారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి వివరాలు వెల్లడించారు. ముత్యంపేట గ్రామానికి చెందిన రమేష్ తన కారును డిసెంబర్‌లో రూ.3.85 లక్షలకు చింతమాన్‌పల్లికి చెందిన పల్లె పోచయ్యకు విక్రయించాడు. కారుపై తీసుకున్న లోన్‌కు సంబంధించిన వాయిదాలు, మిగిలిన డబ్బుల చెల్లింపుల విషయంలో ఇదివరకే పలు సార్లు ఇరువురి మధ్య గొడవ జరిగింది. రమేష్ గురువారం వేకువజామున చింతమాన్‌పల్లి శివారులో పోచయ్య నిర్వహిస్తున్న ఇటుకబట్టీ వద్దకు వెళ్లి తన కారును తీసుకువెళ్లే ప్రయత్నం చేశాడు. అక్కడే నిద్రపోతున్న పోచయ్య లేచి రమేష్‌ను అడ్డుకున్నాడు. పోచయ్య అతని బంధువు హరి, ఇటుక బట్టీలో పనిచేసే కూలీలు రమేష్, రాజు, బిదేశీ నాయక్‌లు కలిసి రమేష్‌పై కర్రలతో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు రమేష్‌ను కామారెడ్డి జనరల్ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుని భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.